సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 17 । జూన్ । 2024



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి పోతురి రామకృష్ణంరాజు(హైదరాబాద్) రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు.



మూగజీవాలను వధలండి

మనుషుల్లాగే మూగజీవాలకూ హక్కులు ఉన్నాయి.. వీటిని పటిష్టంగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తోంది..

8లో

డెల్టాకు 7,845 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 7,845 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,180, మధ్య డెల్టాకు 1,565, పశ్చిమ డెల్టాకు 4,100 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద 9.25 నీటిమట్టం అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

మసీదుల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు



ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బక్రీద్ పండగ సందర్భంగా జిల్లాలో నున్న మసీదుల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ పి.జగదీష్ ఆదివారం తెలిపారు. ముందుగా ఆయన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మత పెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి జిల్లాలో మత సామరస్యాన్ని కాపాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో సుఖ సంతోషాలతో ముస్లిం సోదర, సోదరీమణులు వారి కుటుంబ సభ్యులతో బక్రీద్ పండగ జరుపుకోవాలన్నారు. మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో హైకోర్టు ఆదేశాలు, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి ఏపీ గోవధ నిర్మూలన, జంతుసంరక్షణ చట్టం 1977, జంతు రవాణా నిబంధల చట్టం 1978, జంతు రవాణా నిబంధనలు 2001, జంతు వధశాలల నిబంధనలు 2001 ప్రకారం చర్యలు తీసుకుకోవాలని సంబంధిత నోడల్ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామన్నారు. గోవధ, పశువుల అక్రమ రవాణాపై ఏదైనా సమాచారం ఉంటే పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 91548 80083, డయల్ 112, 100, నోడల్ ఆఫీసర్ ఫోన్ నంబర్ 94907 60844కు సమాచారం ఇవ్వాలన్నారు.

భజే విఘ్ననాయకా..



అయినవిల్లి ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయమే స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి మేలుకొలుపు సేవ నిర్వహించారు. సంకటహర చతుర్థి పూజలు చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో విఘ్నేశ్వరుడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 66 మంది, లక్ష్మీగణపతి హోమంలో 23 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. 49 మంది నూతన వాహన పూజలు, 26 మంది చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు జరిపారు. 12 మంది తలనీలాలు సమర్పించారు. అన్నదాన పథకంలో 1,344 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.2,54,916 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

బాబ్బాబూ.. బదిలీ ప్లీజ్..

- అనుకూల ప్రాంతాల కోసం ఉద్యోగుల ప్రయత్నాలు
- మంత్రులు, ఎమ్మెల్యేల వద్దకు క్యూ
- రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖల్లో పైరవీల జోరు
- అడుగులకు మడుగులొత్తే అధికారుల కోసం ఎమ్మెల్యేల పట్టు



సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యాయి. కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. మంత్రుల నియామకం, శాఖల కేటాయింపు ప్రక్రియ ముగిసింది. శాఖల ప్రక్షాళన, అధికారుల బదిలీలపై నూతన ప్రభుత్వం దృష్టి సారించింది. తమకు అనుకూలమైన, తమ అడుగులకు మడుగులొత్తే అధికారులను నియమించుకునేందుకు సన్నాహాలు ప్రారంభించింది. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ తాము చెప్పినట్టు పని చేసే అధికారులు, ఉద్యోగులను నియమించుకోవడంపై దృష్టి పెట్టింది. తమ ప్రభుత్వానికి సానుకూలంగా వ్యవహరించే వారిని వెతికే పనిలో పడింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యోగుల్లో బదిలీల హడావుడి మొదలైంది. ఎన్నికల సమయంలో ఇతర ప్రాంతాలు, జిల్లాల నుంచి వివిధ శాఖలకు వచ్చిన అధికారులు, సిబ్బంది తిరిగి స్వస్థలాలకు వెళ్లేందుకు, మంచి స్థానాలకు బదిలీ చేయించుకునేందుకు పావులు కదుపుతున్నారు. బదిలీ సిఫారసుల కోసం మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు క్యూ కడుతున్నారు. కొంత మంది రోజంతా అక్కడే పడిగాపులు పడుతున్నారు.

దశల వారీగా..

దశల వారీగా ఉద్యోగుల బదిలీలు చేపట్టే దిశగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన అధికారులను తొలి దశలోనే సాగనంపాలని కూటమి నేతలు ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే జిల్లాలో అప్పటి వరకూ పని చేస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో వారందరూ తిరిగి సొంత జిల్లాకు వచ్చేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన వారు ఈ నెలాఖరుకు జిల్లాకు రానున్నారు. ఎన్నికల్లో గెలిచిన టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా ఉండే అధికారుల కోసం అన్వేషిస్తున్నారు. అటు పలువురు ఉద్యోగులు కూడా ఆయా నేతల ద్వారా కోరుకున్న మండలాల్లో పోస్టింగ్ వేయించుకునేందుకు పావులు కదుపుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో తెర వెనుక మంతనాలు జరుపుతున్నారు. గత ప్రభుత్వంలో వివిధ కారణాలతో అప్రధాన పోస్టుల్లో ఉన్న వారు ప్రస్తుతం మెరుగైన, బాగా డబ్బులు వచ్చే స్థానాల కోసం పైరవీలు చేస్తున్నారని తెలుస్తోంది. దీని కోసం వారు టీడీపీ ఎమ్మెల్యేల వద్దకు క్యూ కడుతున్నారు. వారి ఇళ్లకు వెళ్లి, కోరుకున్న చోట తమకు అవకాశం కల్పించాలని, వారు చెప్పినట్లే నడచుకుంటామని స్పష్టం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం అనుకూల అధికారుల కోసం ఆచితూచి అడుగులు వేస్తున్నారు. తమ పట్ల విధేయులై, అంకిత భావంతో పని చేసే వారికి అవకాశం ఇవ్వాలని, అటువంటి అధికారులు ఎవరున్నారని ఆరా తీస్తున్నారు. తమ అనుచరుల ద్వారా వివరాలు తీసుకుని, ఆయా అధికారులను తమ ప్రాంతాల్లో నియమించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇదే అదునుగా కొందరు ద్వితీయ శ్రేణి నేతలు సైతం పోస్టుకు ఇంత అని బేరం పెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- ఎన్నికల ముందు అనపర్తి నుంచి ఓ మండల స్థాయి మహిళా అధికారి నిడదవోలుకు బదిలీ అయ్యారు. ఆమె నిడదవోలులోనే కొనసాగడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్‌కు విన్నవించుకున్నారని తెలుస్తోంది. దీనికి ఆయన కూడా సరేనన్నట్టు సమాచారం.
- అలాగే, ఎన్నికలకు పూర్వం రాజమహేంద్రవరం సిటీ నుంచి కృష్ణా జిల్లాకు బదిలీ అయిన ఓ మండల స్థాయి అధికారి తిరిగి ఇక్కడకే వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ద్వారా పావులు కదుపుతున్నారని చెబుతున్నారు.
- నిడదవోలు మండలం సమిశ్రగూడెం నుంచి బదిలీ అయిన ఓ పోలీసు అధికారి కూడా తిరిగి పాత స్థానంలో చేరేందుకు టీడీపీ నేతల ద్వారా ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు తెలుస్తోంది.
- ఇదేవిధంగా పలువురు అధికారులు, ఉద్యోగులు బదిలీల కోసం ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

తహసీల్దార్, ఎంపీడీఓ పోస్టులకు డిమాండ్

బదిలీల్లో తహసీల్దార్, ఎంపీడీఓ పోస్టులకు అత్యధిక డిమాండ్ ఏర్పడింది. ఏ ఎండకు ఆ గొడుకు అన్న చందంగా వ్యవహరించే కొంత మంది అధికారులు గత ప్రభుత్వ హయాంలో కీలక పోస్టుల్లో పని చేసి, తిరిగి మరోచోట తమకు అదే స్థాయి పోస్టులు కట్టబెట్టాలని పైరవీలు చేస్తున్నారు. సామాజిక వర్గాల వారీగా కులం కార్డుతో ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో తలమునకలవుతున్నారు. కీలకమైన, ఆదాయం ఎక్కువగా వచ్చే మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్సై, సీఐ పోస్టులు పొందేందుకు పోటీ పడుతున్నారు. టీడీపీ కార్యకర్తలతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు సైతం టీడీపీ ఎమ్మెల్యేల కార్యాలయాల్లో దర్శనమిస్తున్నారు. దీనికి తోడు టీడీపీ, జనసేనకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు సైతం తమకు తెలిసిన వారంటూ ఆయా అధికారులను, ఉద్యోగులను పరిచయం చేస్తున్నారు. ఎలాగైనా తమ ప్రాంతాల్లో నియమించుకునేందుకు ఎమ్మెల్యేలపై ఒత్తిళ్లు తెస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు ఓకే చెబుతుండగా.. మరికొందరు చూద్దాం.. చేద్దాం అని సమాధానం చెబుతున్నారు. మొత్తమ్మీద బదిలీల అంశం ఈ నెలాఖరుకు ఓ కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కోటసత్తెమ్మను దర్శించుకున్న ఎస్పీ జగదీష్



అమ్మవారి సన్నిధిలో ఎస్పీ జగదీష్ కుటుంబ సభ్యులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారిని జిల్లా ఎస్పీ పి.జగదీష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎస్పీ జగదీష్‌కు ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఈఓ హరిసూర్యప్రకాష్ అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకంతో రూ.1,56,943 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. నిడదవోలు సీఐ వి.జానకీరామయ్య, ఎస్సైలు పి.అప్పారావు, రమేష్, నాగరాజు, మూర్తి, ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవరాశిని కాపాడుకుందాం

కాకినాడ సిటీ: ప్రకృతిలో ఉన్న జీవరాశిని కాపాడుకునే బాధ్యత మానవునిపై ఉందని జిల్లా కేంద్ర గ్రంథాలయ అధికారి, కార్యదర్శి వీఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీన నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రంథాలయ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అడవులను నరకడం అరికట్టాలన్నారు. వృక్ష సంపదను వృద్ధి చేయాలని, ప్రతి ఒక్కరూ మొక్కలను వేల సంఖ్యలో నాటి సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. మొక్కలు నాటడం బాధ్యతగా నిర్వహించాలన్నారు.

ఘనంగా సత్యదేవుని రథోత్సవ సేవ



ఆలయ ప్రాకారంలో సాగిన రథోత్సవ సేవ

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి రథోత్సవసేవ ఆదివారం ఉదయం రత్నగిరి ఆలయ ప్రాకారంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చి దానిపై సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ఉంచి అర్చకులు పూజలు చేశారు. అనంతరం భక్తులు కొబ్బరికాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు. తరువాత వేద పండితుల మంత్రోచ్చాటన మధ్య బాజా భజంత్రీల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో మూడుసార్లు రథంతో ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం పండితులు పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను మేళతాళాల మధ్య ఆలయానికి తీసుకువెళ్లారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠీ, ముష్టి పురుషోత్తం, చిట్టి శివ ఘనపాఠీ, యనమండ్ర శర్మ, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్య శర్మ, అర్చకులు సుధీర్, పరిచారకులు పవన్, శివ పూజలు చేశారు. ఆలయ ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు, ఇతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రూ.2,500 చొప్పున ముగ్గురు భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి రథోత్సవ సేవలో పాల్గొన్నారు. వీరికి స్వామివారి అంతరాలయ దర్శనంతో బాటు వేదాశీస్సులు అందజేశారు. స్వామివారి కండువా, జాకెట్టు ముక్క, ప్రసాదం బహూకరించారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ

రత్నగిరి సత్యదేవుని ఆలయం ఆదివారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. స్వామివారి వ్రతాలు రెండువేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది.

యోగాతో ఆరోగ్యం



యోగాపై ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు, బీసీ రాయ్ అవార్డు గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి పేర్కొన్నారు. జూన్ 21వ తేదీ ఇంటర్నేషనల్ యోగ డేని పురస్కరించుకొని యోగ ఆవశ్యకతను తెలియజేస్తూ భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు, అంతర్జాతీయ యోగా జడ్జి కర్రి నాగవెంటక శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పతంజలి తూర్పుగోదావరి జిల్లా శాఖ, మహిళా పతంజలి, కిసాన్ సేవా సమితి, యువ భారత్ సంయుక్తంగా నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. సుమారు వందమంది యోగ గురువులు యోగ సాధకులు ఈ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ రామాలయం జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, తాడితోట, స్టేడియం రోడ్డో, శ్యామల సెంటర్, గోదావరి గట్టు రోడ్డు, మార్కండేయ స్వామి గుడి మీదుగా పుష్కర్ ఘాట్ వరకు నిర్వహించారు. యోగా చేద్దాం – ఆరోగ్యంగా ఉందాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో స్మార్ట్ యోగ శివకుమార్, తూర్పుగోదావరి జిల్లా మహిళా పతంజలి అధ్యక్షురాలు వీర వేణి (వేణు), మహిళా పతంజలి ఉపాధ్యక్షురాలు కర్రి సత్యలలిత కుమారి పాల్గొన్నారు.

పురావస్తుకు పూర్వ వైభవం

- ఆంధ్ర సాహిత్య పరిషత్‌కు కొత్త రూపు
- అంతర్జాతీయ మ్యూజియం ఏర్పాటు దిశగా అడుగులు
- ఫలించిన ఏడాదిన్నర ప్రయత్నం
- రూ.10 కోట్ల మంజూరుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్
- రాష్ట్రం రూ.2 కోట్లు ఇస్తే సరికొత్త భవనం నిర్మాణం
- ఫలించిన తాజా మాజీ ఎంపీ గీత కృషి



కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్ (ఆర్కియలాజికల్ మ్యూజియం)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వందల సంఖ్యలో తాళపత్ర గ్రంథాలు, కళాఖండాలు, చరిత్రకు సాక్ష్యంగా నిలిచే శాసనాలు కనుమరుగైపోతాయనే చింత లేదిక. తెల్లదొరల ఏలుబడిలో నూరేళ్ల క్రితం కాకినాడలో కొలువుదీరిన ఆంధ్ర సాహిత్య పరిషత్ (ఆర్కియలాజికల్ మ్యూజియం) దశ తిరగనుంది. నూరేళ్ల క్రితం ఏర్పాటైన ఈ పరిషత్‌కు పూర్వ వైభవం కోసం హేమాహేమీలు ప్రయత్నించినా ప్రభుత్వాలు చిల్లిగవ్వ విదల్చలేదు. అటువంటిది ఈ ప్రతిష్టాత్మక సంస్థ ప్రగతి కోసం కాకినాడ తాజా మాజీ ఎంపీ వంగా గీత రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో కేంద్ర స్థాయిలో ఏడాదిన్నరగా చేసిన కృషి సత్ఫలితాన్నిచ్చింది. ఈ సాహిత్య పరిషత్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో మ్యూజియం నిర్మాణానికి మార్గం సుగమమైంది. దీనికోసం రూ.10 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. ఈ స్థాయి నిధుల కోసం రెండు మూడు దశాబ్దాలుగా ఉద్దండులైన నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలితమివ్వలేదు. కొంతలో కొంత తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యం ఈ పరిషత్‌కు కలిసొచ్చింది. ఈ పరిషత్‌లోని తాళపత్ర గ్రంథాలు, చారిత్రక ఆనవాళ్లను భవిష్యత్ తరాలకు భద్రంగా అందించేందుకు వీలుగా టీటీడీ తన భుజస్కంధాలపై వేసుకుని కెమికలైజేషన్, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసింది. ఇంతవరకూ బాగానే జరిగినా ఇక్కడున్న తాళపత్ర గ్రంథాలు, చారిత్రక ఆధారాలు, కళాఖండాల స్థాయికి తగినట్టు భవనం లేకపోవడం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సాహితీప్రియులకు, యువతకు కొంత వెలితిగానే మిగిలింది.

మూడంతస్తులుగా..

ఈ నిధులు వస్తే కాకినాడలో ఇప్పుడున్న ఆంధ్ర సాహిత్య పరిషత్ భవనాన్ని మొత్తం తొలగిస్తారు. దీని స్థానంలో అత్యంత ఆధునిక హంగులతో మూడు అంతస్తుల్లో ఇంటర్నేషనల్ మ్యూజియం నిర్మించాలని ప్రతిపాదించారు. మొదటి అంతస్తులో వందలాది తాళపత్ర గ్రంథాలు, అపురూపమైన అద్దంకి, యుద్ధమల్లుని బెజవాడ శాసనాలను భద్రపరిచి ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. రెండో అంతస్తులో అపురూప కళాఖండాలు, ఉమ్మడి ఉభయ గోదారి జిల్లాల్లో జరిగిన తవ్వకాల్లో బయటపడిన పురాతన విగ్రహాలు ఏర్పాటు చేస్తారు. సాహితీ సభలు, సమావేశాలు, సదస్సులు నిర్వహించుకునేందుకు వీలుగా మూడో అంతస్తు నిర్మించే దిశగా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. కళల కాణాచిగా, చారిత్రక నగరంగా పేరొందిన రాజమహేంద్రవరానికి దీటుగా కాకినాడ స్మార్ట్ సిటీలో ఒక మ్యూజియం ఏర్పాటు చేయాలన్నది సాహితీప్రియుల చిరకాల ఆకాంక్ష. ఆ స్థాయి మ్యూజియానికి ఆంధ్ర సాహితీ పరిషత్తుకు నిర్మించే నూతన భవనం సరైనదిగా నగర ప్రముఖులు భావిస్తున్నారు.

ఘన చరిత్ర

నేడు కాకినాడగా పిలిచే నాటి కో కెనడాలో ఆంధ్ర సాహిత్య పరిషత్తు నూరేళ్ల క్రితం కొలువుదీరింది. 1911 మే 12న నాటి చెన్న పట్టణం(నేటి చెన్నై)లో తెలుగు భాషా పరిరక్షణ కోసం పీఠికాపురాధీశ్వరుడైన కళాప్రపూర్ణ సూర్యారావు బహదూర్, ఆంధ్ర తొలి ఉప కలెక్టర్ జయంతి రామయ్య పంతులు ఆధ్వర్యాన ఈ పరిషత్తుకు అంకురార్పణ జరిగింది. 1913 ఆగస్టు 8న కంపెనీ చట్టం ద్వారా రిజిస్టర్ అయి 1919లో కాకినాడ నగరంలో దీనిని స్థాపించారు. వెల కట్టలేని వందలాది తాళపత్ర గ్రంథాలు, చరిత్రకు సాక్షిగా నిలిచే అనేక శాసనాలు ఇందులో నిక్షిప్తమై ఉన్నాయి. 1946లో ప్రభల సుందర రామయ్య, వెంకట సుబ్బమ్మ దంపతులు దానం చేసిన భవనంలోనే నేటికీ ఈ పరిషత్తు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. 1973 జూన్‌లో నాటి పరిషత్తు అధ్యక్షుడు దంటు భాస్కరరావు చొరవతో రాష్ట్ర ప్రభుత్వ పురావస్తు శాఖ ఆధీనంలోకి ఈ సంస్థ వెళ్లింది. 2011లో శతజయంత్యుత్సవాలు కూడా నిర్వహించారు. ఇంతటి ప్రతిష్టాత్మక సంస్థను అంతర్జాతీయ స్థాయి మ్యూజియం ఏర్పాటు ద్వారా రాష్ట్రంలోనే ప్రముఖ పరిశోధనా సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మాజీ ఎంపీ గీత చొరవతో..

పరిషత్‌లో దీనావస్థను కాకినాడ ఎంపీగా గుర్తించిన గీత చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లడంతో దీని పునర్వైభవానికి అడుగులు పడ్డాయి. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ప్రజాప్రతినిధులందరూ ఆ హడావిడిలో మునిగిపోయారు. అదే సమయంలో కేంద్రం మ్యాచింగ్ గ్రాంట్ రూ.10 కోట్లు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.2 కోట్లు మంజూరు చేస్తే కేంద్రం ఆ నిధులు విడుదల చేయనుంది. ప్రస్తుతం ఈ ప్రక్రియ నడుస్తోంది.



కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ ముగ్ధా సిన్హాను కలసిన తాజా మాజీ ఎంపీ వంగా గీత (ఫైల్)

అపురూప శాసనాలు, విగ్రహాలు

పండరంగని అద్దంకి శాసనం, యుద్ధమల్లుని బెజవాడ శాసనం సహా 88 శాసనాలు ఆంధ్ర సాహిత్య పరిషత్తులో ఉన్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగిన తవ్వకాల్లో బయటపడిన పురాతన హైందవ, బౌద్ధ, జైన విగ్రహాలు, చారిత్రక కళాఖండాలు, 5 వేలకు పైబడిన తాళపత్ర గ్రంథాలు, సుమారు 500 రాత ప్రతులు, 1880 నుంచి ముద్రితమైన ఆంధ్ర, కన్నడ, ఆంగ్ల సంస్కృత గ్రంథాలు 10 వేలు పైనే ఇక్కడ నిక్షిప్తమై ఉన్నాయి. సాహిత్య, చరిత్ర పత్రికలు, ఆంధ్ర హిస్టారికల్ జర్నల్, భారతి తదితర పాత ప్రతులు ఇక్కడ లభ్యమవుతాయి. సూర్యరాయ బహదూర్, మునగాల రాజా, పోలవరం జమీందారుల సహాయంతో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, వేదం వేంకటరాయశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, కళాప్రపూర్ణ డి.శేషగిరి పంతులు తోడ్పాటుతో ప్రథమాంధ్ర డిప్యూటీ కలెక్టర్ మధురకవి జయంతి రామయ్య పంతులు సంకల్పంతో ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఎంతో ఖ్యాతికెక్కింది. 200 ఏళ్ల తెలుగు చరిత్ర పునర్నిర్మాణానికి మూలమైన సుమారు 800 శాసనాల ప్రకటన ద్వారా తెలుగు సాంస్కృతిక చరిత్రలో తలమానికంగా నిలుస్తోంది. ఇటీవలనే కొట్టాం, కుమ్మరిలోవ, జనార్దనగిరి (నామాగిరి నరేంద్ర పట్టణం), ములగపూడి, ఎ.కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో జరిపిన తవ్వకాలలో చరిత్ర విస్మరించిన బౌద్ధ, జైన, హైందవ నాగరికతలను వెలుగులోకి తేవడంలో ఈ పరిషత్తు తోడ్పాటు ఎంతో ఉంది. ఇంతటి గొప్ప సంస్థకు అంతర్జాతీయ ప్రమాణాలతో మ్యూజియం ఏర్పాటు చేసి, నేటి తరం పరిశోధకులు, సాహితీప్రియులు సద్వినియోగం చేసుకునేలా.. తెలుగు చరిత్ర, సాహిత్య సాంస్కృతిక పునరుజ్జీవనానికి తోడ్పడేలా.. ఈ ఘన వారసత్వాన్ని భావితారాలకు అందించేలా మ్యూజియం నిర్మాణం జరగాలని సాహితీప్రియులు, చారిత్రక పరిశోధకులు ఆకాంక్షిస్తున్నారు.





మ్యూజియంలో భద్రపరిచిన దేవతామూర్తుల విగ్రహాలు

క్లుప్తంగా

రోడ్డు సేఫ్టీ వాహనాన్ని ఢీకొన్న కారు



హైవే అంబులెన్స్‌లో క్షతగాత్రురాలిని చికిత్సకు తరలిస్తున్న దృశ్యం

గండేపల్లి: ఓ కారు రోడ్డు సేఫ్టీ వాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. రోడ్డు సేఫ్టీ సిబ్బంది కథనం ప్రకారం.. అన్నవరం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు మల్లేపల్లి గ్రామ శివారుకు వస్తోంది. అప్పటికే ఇన్నోవా కారు ప్రమాదానికి గురవడంతో అక్కడ హైవే రోడ్డు సేఫ్టీ, పోలీస్ రోడ్డు సేఫ్టీ వాహనాలు నిలిపిఉన్నాయి. ఇందులో హైవే వాహనాన్ని తప్పించిన కారు ముందు ఉన్న వాహనాన్ని ఢీకొని పక్కనే ఉన్న పంట పొలంలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురికి గాయాలు కావడంతో స్థానికుల సహాయంతో హైవే అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి




రామచంద్రరావు (ఫైల్)

ఆత్రేయపురం: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలిచేరులో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. వెలిచేరుకు చెందిన తిరుమలనాథుని రామచంద్రరావు (38) అదే గ్రామంలో ఎరువుల షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఈ నెల 15న పురుగు మందు తాగాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో తెలిపాడు. వెంటనే వారు వచ్చి బాధితుడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

30 టన్నుల చౌక బియ్యం పట్టివేత

నల్లజర్ల: లారీలో అక్రమంగా తరలిస్తున్న చౌక బియ్యాన్ని ఆదివారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని జగన్నాథపురం పుంత రహదారిలో బియ్యం లోడు లారీ ఉన్నట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు అక్కడికి వెళ్లి తనిఖీ చేశారు. రూ.13.65 లక్షల విలువైన 30 టన్నుల చౌకబియ్యం లారీలో ఉన్నట్టు గుర్తించారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ కార్తీక్ గడభ, లారీ యజమాని లక్ష్మణ్ శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ ఎస్‌ఐ జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ బియాన్ని గోపాలపురం స్టాక్ పాయింట్‌కు తరలించామన్నారు. వీఆర్వో లక్ష్మణమూర్తి, హెడ్ కానిస్టేబుల్ జీవానందం పాల్గొన్నారు.

మూగజీవాలను వధలండి



కిక్కిరిసిన వ్యాన్‌లో పశువుల రవాణా



- పటిష్టంగా గోవధ నిషేధ, పశు సంరక్షణ చట్టం
- పశువుల వధను అడ్డుకునేలా పౌరులకు హక్కులు
- నిందితులను పోలీసులకు అప్పగించేలా సెక్షన్లు

అమలాపురం టౌన్: మనుషుల్లాగే మూగజీవాలకూ హక్కులకు ఉన్నాయి.. వీటిని పటిష్టంగా అమలు చేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తోంది.. గోవధ నిషేధ, పశు సంరక్షణ చట్టం-1977 సాధారణ నేరాల కంటే కొన్ని భిన్నమైన వెసులబాటులను పౌరులకు కల్పించింది. ఈ చట్టంలోని సీఆర్‌పీసీ-43 ప్రకారం ఎక్కడైనా ఎవరైనా గోవధ, అక్రమ రవాణా చేస్తుంటే కాగ్నిజబుల్ నేరం కింద ప్రైవేట్ వ్యక్తులెవరైనా ఆ నేరాన్ని అడ్డుకోవచ్చు. దానికి బాధ్యులైన నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించే సామాజిక బాధ్యతను ప్రైవేట్ వ్యక్తులకు ఈ చట్టం కల్పించింది. జిల్లాలో ఎక్కడా జంతువుల వధ జరగకుండా అడ్డుకునేందుకు జిల్లా అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. ఈ చట్టంపై అధికారులు తెలిపిన వివరాలు ఇలా..

నేరానికి పాల్పడితే శిక్షలు

చట్టంలోని 428, 429 ప్రకారం పశు రవాణా సమయంలో ఏదైనా పశువు చనిపోతే ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తారు. నిందితుల నేరం రుజువైతే రెండు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష ఉంటుంది. పశువుల వధ, అక్రమ రవాణాను చూసిన పౌరులు 100కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వొచ్చు. పోలీసులు అక్రమ రవాణాను అడ్డుకుని అదుపులోకి తీసుకున్న పశువులను సురక్షితంగా రిజిస్టర్ అయిన గోశాలకు తరలించాలి. పశువులను రవాణా చేస్తే దానికి పశు వైద్యుడి అనుమతితో కూడిన పత్రం ఉండాలి. రవాణా చేసే పశువు వయసు 14 ఏళ్లు దాటి ఉండాలి. ప్రభుత్వ అనుమతి ఉన్న కబేళాలో మాత్రమే పశువులను వధించాలి. అదీ పశు వైద్యుడి ధ్రువీకరణతో జరగాలి.

చట్టంలోని ప్రధాన అంశాలివి

- ఒక లారీలో ఆరు పశువుల కంటే ఎక్కువ రవాణా చేయరాదు.
- లారీలో ఆరు పశువులను తరలిస్తున్నప్పుడు పశు వైద్యుడి ధ్రువీకరణ పత్రం విధిగా ఉండాలి.
- వాహనంలో పశువులతో పాటు వాటి బాగోగులు చేసుకునేందుకు ఒక అటెండెంట్‌ను నియమించాలి.
- ప్రథమ చికిత్స పెట్టె (ఫస్ట్ ఎయిడ్ బాక్స్), పశువులకు సరిపడా మేత, నీరు అందుబాటులో ఉంచాలి.
- పూర్తిగా మూసి ఉన్న వాహనంలో పశువులను తరలించరాదు.
- చట్టంలోని సెక్షన్ 11 ప్రకారం పశువులను రక్తమోడేలా హింసిస్తూ, గాలి ఆడకుండా, నొప్పులతో బాధ పడుతూ, వాహనంలో ఓవర్ లోడ్‌తో తరలించడం నేరం.
- చట్టంలోని సెక్షన్-5 ప్రకారం ఆవులను, దూడలను ఎట్టి పరిస్థితుల్లో ఉద్దేశపూర్వకంగా సంహరించరాదు.
- మిగిలిన పశువులు అంటే ఎద్దులు, దున్నలు, గేదెలు (ఆవులు మినహా) మొదలైన పశువులను చంపాలంటే వాటి వయసు కచ్చితంగా 14 ఏళ్లు దాటాలి.
- వ్యవసాయానికి, బ్రీడ్ డెవలప్‌మెంట్‌కు పూర్తిగా నిరుపయోగంగా ఉన్నాయని ప్రభుత్వ పశు వైద్యుడు నిర్ధారించి పత్రం ఇస్తేనే వాటిని వధించాలి.

ప్రత్యేక నిఘా అవసరం



సంతల వద్ద పశువులను కొనుగోలు చేసి వధించేందుకు అక్రమ రవాణా చేసే ముఠాలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. అలాంటి పశువుల సంతల్లో పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలి. అలాగే నగరాలు, పట్టణాల్లో అర్ధరాత్రి సమయాల్లో వాహనాల్లో ఎక్కించి ఆవులను వధించేందుకు అక్రమ రవాణా చేసే ముఠాలపై పోలీసులు ఓ కన్నేయాలి. గోశాలల్లో ఆవులకు రక్షణ ఉంటున్నా బయట మాత్రం రక్షణ ఉండడం లేదు.

– పోతురాజు రామకృష్ణారావు, వ్యవస్థాపకుడు, శ్రీగౌతమ మహర్షి గోసంరక్షణ సమితి గోశాల, అమలాపురం

పశు వైద్యుల ధ్రువీకరణ ఉండాలి



పశువుల సంరక్షణ చట్టంలోని నిబంధనల ప్రకారం ఆవులను వధించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం లేదు. ఎద్దులు, గేదెలు తదితర పశువులను వధించాల్సి వస్తే అందుకు అనుగుణంగా పశు వైద్యుల ధ్రువీకరణ పత్రం విధిగా ఉండాలి. రవాణాకు పశువుల వయో పరిమితి నిబంధనను పాటించాలి.

– డాక్టర్ ఎల్.విజయరెడ్డి, సహాయ సంచాలకులు, పశు సంవర్ధక శాఖ, అమలాపురం

వివాహిత దారుణ హత్య



వాకలపూడిలో హత్యకు గురైన ఓలేటి సీత

కాకినాడ రూరల్: వాకలపూడి ఫిషింగ్ హార్బర్‌పేటలో శనివారం అర్ధరాత్రి ఓ వివాహిత దారుణ హత్యకు గురైంది. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. హార్బర్‌పేటకు చెందిన ఓలేటి నరసింహమూర్తితో ఓలేటి సీత (26)కి ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. సీత రొయ్యల కంపెనీలో పనిచేస్తుండగా, భర్త నరసింహమూర్తి సీపోర్టు వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య ఎటువంటి గొడవులు లేవని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల ఎన్నికల్లో బెట్టింగ్‌ల ద్వారా సుమారు రూ.3.5 లక్షలు నరసింహమూర్తి పోగొట్టుకోవడంతో బంధువులు కొద్దిగా సహాయం చేయగా, మిగిలిన వాటికి భార్య బంగారు వస్తువులు తాకట్టు పెట్టేందుకు చూడడంతో ఇద్దరు మధ్య గొడవ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తీవ్ర ఆవేశంతో భార్యను కర్రతో కొట్టి హత్యచేసి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు నరసింహమూర్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై సర్పవరం ఎస్సై అజయ్‌బాబు ఆదివారం కేసు నమోదు చేయగా, ఇన్‌చార్జి సీఐ సన్యాసిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మారేడుమిల్లి (అల్లూరి జిల్లా): బోదులూరు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడకు చెందిన శ్రీకాంత్ (19) మృతి చెందాడు. ఆ వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన శేషన్, శ్రీకాంత్‌లు రాజమహేంద్రవరంలోని గైట్ కాలేజీలో బీటెక్ చదువుతున్నారు. వీరు బైక్‌పై రాజమహేంద్రవరం నుంచి వై.రామవరంలో బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి పర్యాటక ప్రాంతమైన గుడిసె హిల్ స్టేషన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా బోదులూరుకు సమీపంలో మారేడుమిల్లి నుంచి పాతకోట వైపుగా వెళ్తున్న మరో బైక్ ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బోదులూరు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం అతన్ని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ శ్రీకాంత్ మృతి చెందాడు.

నేటి నుంచి భీమేశ్వరుని దర్శనాలు



మూల విరాట్ వద్ద కలశపూజ చేస్తున్న వేద పండితులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరుని ఆలయంలో సోమవారం ఏకాదశి నుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. కొన్నేళ్ల కిందట నిర్మించిన క్షేత్రంలో స్వామివారి శివలింగం జీర్ణస్థితికి చేరింది. గత నెల 29 నుంచి ఆలయంలో స్వామి, అమ్మవార్ల దర్శనాలను నిలిపివేసి 20 రోజుల పాటు పురావస్తు శాఖ ఆధ్వర్యంలో శివలింగానికి కెమికల్ ట్రీట్‌మెంట్ పనులు చేపట్టారు. శనివారంతో పనులు పూర్తయ్యాయి. ఆదివారం ఆలయంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కొబ్బరికాయ కొట్టి స్వామివారిని దర్శించుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం నుంచి భక్తులకు దర్శనం కల్పించడానికి దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. కేంద్ర పురావస్తు శాఖ ఈ నెల 23 వరకూ ఎటువంటి అభిషేకాలు చేయడానికి వీలులేదని ఆదేశాలు జారీ చేసింది.

అనంతలక్ష్మీ సత్యవతీదేవికి వజ్రకిరీటం

- రూ.1.50 కోట్లతో తయారీ
- సమర్పించనున్న పారిశ్రామికవేత్త సత్యప్రసాద్ దంపతులు


అన్నవరం: కోరిన కోర్కెలు తీర్చే రత్నగిరి వాసుడు సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు త్వరలోనే వజ్ర కిరీటంతో వెలుగొందనున్నారు. పెద్దాపురానికి చెందిన దాత, లలితా రైస్ ఇండస్ట్రీ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్, సూర్యకమల దంపతులు సుమారు రూ.కోటిన్నరతో ఈ కిరీటాన్ని తయారు చేయించారు. ఈ విషయాన్ని ఆదివారం అన్నవరంలో దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్‌కు దాత సత్యప్రసాద్ తెలిపారు. ఆగస్టులో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా అనంతలక్ష్మీ సత్యవతీదేవికి కిరీటం అలంకరిస్తామని తెలిపారు. దాత సత్యప్రసాద్ దంపతులు రెండేళ్ల కిందట సత్యదేవునికి రూ.కోటిన్నరతో వజ్రకిరీటం చేయించారు. ఆ సమయంలో అమ్మవారికీ కిరీటం చేయిస్తానని ప్రకటించి ఇప్పుడు చేయించారు. అలాగే అన్నవరం దేవస్థానంలో సుమారు రూ.ఆరు కోట్లతో స్వామివారి ప్రసాద తయారీ భవన నిర్మాణం, సహస్ర దీపాలంకార సేవ మందిరం, అందుకు అవసరమైన ఊయల, పూజా సామగ్రి, సత్యదేవునికి రోజూ సాయంత్రం ఏడు గంటలకు నిర్వహించే పంచహారతి సేవలో ఉపయోగించే వెండి సామగ్రి అందజేశారు. ప్రతి నిత్యం స్వామివారికి నివేదనకు బియ్యం సమర్పిస్తున్నారు.



దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్‌తో మాట్లాడుతున్న దాత మట్టే సత్యప్రసాద్

కిలో బంగారం, 130 క్యారెట్ల వజ్రాలు

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి కిలో బంగారం, 130 క్యారెట్ల వజ్రాలతో కిరీటం చేయించినట్లు దాత సత్యప్రసాద్ తెలిపారు. దీనిని చెన్నైలోని జీఆర్‌టీ జ్యుయలర్స్‌తో చేయించామని వివరించారు. కాగా సత్యదేవునికి గతంలో వజ్రకిరీటం చేయించినప్పుడు కర్ణాభరణాలు చేయించలేదు. ఇప్పుడు ఆ కర్ణాభరణాలతో పాటు అమ్మవారికి కూడా చేయించినట్లు దాత తెలిపారు. వీటిని అమ్మవారికి వజ్రకిరీటంతో పాటు అలంకరిస్తారన్నారు. ఈ సత్కార్యంలో పాలుపంచుకోవడం తన పూర్వజన్మ సుకృతమని దాత అన్నారు.



అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి చేయించిన వజ్రకిరీటం, సత్యదేవునికి చేయించిన వజ్ర కర్ణాభరణాలు, అనంతలక్ష్మీ సత్యవతీదేవికి కర్ణాభరణాలు

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ



కాంస్య పతకం చూపుతున్న ప్రద్యుమ్న

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఒడిశా రాష్ట్రంలోని కటక్ పట్టణంలో జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 14 నుంచి జరుగుతున్న జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన నాగం ప్రద్యుమ్న ప్రతిభ కనబరిచాడు. ఆదివారం జరిగిన పోటీల్లో సేబర్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. కోచ్ లక్ష్మీలావణ్య వద్ద శిక్షణ పొందుతున్న ప్రద్యుమ్న కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఆగస్టులో జరగబోయే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రద్యుమ్నను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), ఫెన్సింగ్ జిల్లా సంఘ అధ్యక్షుడు పవన్ వికాస్, కార్యదర్శి పీఎస్‌వీఎస్ ప్రకాష్ (డాక్టర్ బాబు) అభినందించారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు



బాస్కెట్ బాల్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న నూజివీడు- కాకినాడ జట్లు

దేవరపల్లి: రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠ భరితంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం పోటీలు ప్రారంభం కాగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 45 జట్లు పాల్గొన్నాయి. అండర్-14, 17 విభాగాల్లో తమిళనాడుకు చెందిన గుడ్ సమారియాన్ అకాడమీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. టోర్నమెంట్‌లో విజయం సాధించిన ఉత్తమ క్రీడాకారులను అకాడమీ ద్వారా ఉచిత విద్యతో పాటు క్రీడల్లో శిక్షణ ఇస్తారని హైస్కూల్ హెచ్‌ఎం, శాప్ మాజీ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. ఇంటర్ వరకూ ఉచిత విద్య అందిస్తారన్నారు.

రాత్రి 10 గంటల వరకూ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీలు నిర్వహించారు. అండర్-14 విభాగంలో నూజివీడు వీపీహెచ్ స్కూల్, కాకినాడ ఏపీఎస్‌పీ స్కూల్ జట్లు, అండర్-17 విభాగంలో పశ్చిమ గోదావరి, అనంతపురం జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. పోటీలను అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఆర్ ప్రవీణ్ వసంత్ జబజ్ పర్యవేక్షించారు.

కొత్తిమీర.. కొండెక్కిన ధర

- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.200
- ధరాఘాతానికి వినియోగదారుల హడల్
- ఈ నెలాఖరుకు తగ్గే అవకాశం



కొత్తిమీర తోట



ఆలమూరు: కొత్తిమీర కొండెక్కి కూర్చుంది.. తెలుగు సంప్రదాయ వంటకాల్లోని వాడే ఈ ఆకు ధర నానాటికీ పెరుగుతోంది.. మాంసాహారం, శాఖాహారం అనే తేడా లేకుండా ప్రతి వంటకంలో రుచి, వాసన కోసం కచ్చితంగా కొత్తమీరను ఉపయోగిస్తారు. వంటకంలో రుచితో పాటు ఆరోగ్యపరమైన లక్షణాలు కలిగి శారీరక సమస్యలను తొలగించడంలో ఇది విశేషంగా తోడ్పడుతుంది. ఇప్పటి వరకూ సాధారణంగా ఉన్న కొత్తిమీర ధర ఒక్కసారిగా భారీగా పెరిగింది. ఆ ధరకేహో అనిపిస్తుంది. దీంతో భోజన ప్రియులు పెరిగిన ధరను భరించలేని స్థితిలో ఉన్నారు. ఒకప్పుడు కిలోలు లెక్కన కొత్తిమీరను కొనుగోలు చేసి అల్పాహారంలో చెట్నీలు చేసుకునే వినియోగదారులు ప్రస్తుతం గ్రాముల్లో కొనుగోలు చేసి పొదుపుగా కూరల్లో వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కోనసీమ జిల్లాలోని మడికి, రావులపాలెం అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో వారం రోజుల కిందట హోల్‌సేల్‌గా రూ.60 ఉన్న కొత్తిమీర ధర ఆదివారం రూ.160కు చేరింది. దీంతో వ్యాపారులు రవాణా, తరుగు చార్జీలు కలుపుకుని కొంత మేర లాభంతో బహిరంగ మార్కెట్‌లో కిలో కొత్తిమీర రూ.200 వరకూ విక్రయిస్తున్నారు. ఈ పంట స్థానికంగా అందుబాటులో లేకపోవడం వల్ల హోల్‌సేల్ వ్యాపారులు బెంగళూరు నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో బెంగళూరులో పంట దిగుబడి తగ్గడంతో ఆ మేరకు జిల్లాలో కొత్తిమీర దిగుమతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. డిమాండ్‌కు సరఫరాకు తీవ్ర వ్యత్యాసం ఏర్పడటంతో పాటు ఇటీవల జిల్లాలో విపరీతమైన వర్షాలు కురవడంతో గత వారం రోజుల నుంచి ధర పెరుగుతూ వస్తుంది. జిల్లాలోని నదీ పరివాహక, మెట్ట, చాగల్నాడు ప్రాంతాల్లో సాగు చేసిన పంట అందుబాటులోకి వచ్చే వరకూ కొత్తిమీర ధర తగ్గే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

పెరుగుదల ఎందుకంటే..

కొత్తిమీర ధర ఈ ఏడాది జనవరిలో కిలో రూ.20 కూడా పలకకపోవడంతో నిరాసక్తితో అనేక మంది రైతులు పంట మార్పిడి చేశారు. అప్పటి నుంచి వేసవికాలం ప్రారంభం అయ్యే నాటికి కొత్తిమీర పంట పూర్తిగా తగ్గిపోవడంతో కొరత తీవ్రమైంది. దీనివల్ల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రాంతాల్లో హోల్‌సేల్ వ్యాపారులు, దళారులు ప్రస్తుతం బెంగళూరు నుంచి కొత్తిమీరను దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ నుంచి శీతలీకరణ యంత్రాలను అమర్చిన వాహనాల్లో అత్యంత జాగ్రత్తగా కొత్తిమీరను జిల్లాకు తరలిస్తున్నారు. ఇది నిల్వ ఉండే అవకాశం తక్కువగా ఉండటంతో వేగంగా కుళ్లిపోతుంది. దీంతో వ్యాపారులు కొత్తిమీరను వీలైనంత తక్కువగా దిగుమతి చేసుకుని అధిక ధరకు విక్రయిస్తున్నారు.

ఒక్కసారిగా పెరిగింది



మడికి హోల్‌సేల్ మార్కెట్‌లో ఒక్కసారిగా పెరిగిన కొత్తిమీర ధర కూరగాయల వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎక్కువగా కూరగాయలు కొనుగోలు చేసే వినియోగదారులకు కొత్తిమీర ఉచితంగా ఇవ్వడం అలవాటు. అయితే పెరిగిన ధరల దృష్ట్యా ఆ పరిస్థితి లేదు. బెంగళూరు నుంచి దిగుమతి చేసుకుంటున్న సరకు అంతగా నాణ్యత ఉండకపోవడంతో రెండు రోజులకే పాడవుతుంది.

– చిన్నం రాజు, కూరగాయల వ్యాపారి, ఆలమూరు

కొనలేకపోతున్నాం...



బహిరంగ మార్కెట్‌లో సాధారణంగా కొత్తిమీర కట్ట రూ.పదికి లభించేది. పెరిగిన ధరల దృష్ట్యా అదే కట్ట రూ.50కు చేరింది. దీనివల్ల కొత్తిమీరను కొనుగోలు చేయలేకపోతున్నాం. ఈ నెలాఖరు నాటికి కొత్త పంట వస్తుందని, అప్పటి వరకూ ఇదే ధర కొనసాగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. కూరల్లో కొత్తిమీర లేకుండా వంటకాలు చేయలేని పరిస్థితి ఉంది.

– వేగిరౌతు ఆదిలక్ష్మి, గృహిణి, సంధిపూడి